అప్పట్లో బాలూ కృష్ణ, చంద్రమోహన్‌లకు ఒకటీ అరా పాటలు పాడుతున్నారు. ఎంతమంది నటీనటులకు పాడినా అగ్రశ్రేణి నటులకు పాడగలిగినప్పుడే గాయకుడికి గుర్తింపు వస్తుంది. అప్పట్లో టాప్ అంటే తెలుగులో ఎయన్నార్, ఎన్టీయార్, తమిళంలో శివాజీ, ఎంజీఆర్. వీళ్లకి పాడినపుడే పెద్ద బ్రాకెటులోకి వెళ్లినట్టు లెక్క. అందునా ఎంజీయార్ తరహా ఎలాటిదంటే తనకు నచ్చితే తన ప్రొడ్యూసర్ల మెడలు వంచైనా ఒప్పించగల సత్తా వున్నవాడు. తమిళరంగంలో రారాజు.

అలాటివాడు పిలిచి ఛాన్సు యిస్తే వినియోగించుకోలేకుండా ఈ మాయదారి టైఫాయిడు వచ్చి పడింది. ఈయన పాట గురించి ఆగితే జయపూర్ షూటింగు కాన్సిల్ చేసుకోవాలి. అంటే అంతమంది ఆర్టిస్టుల కాల్‌షీట్స్ వేస్టన్నమాట. ఓ కొత్త సింగర్ గురించి అంత అవస్థ పడేవాళ్లెవరున్నారు? కానీ ఎమ్జీయార్ బాలూ ఆరోగ్యం కుదుటపడేదాకా ఆగాడు. జయపూర్ ట్రిప్ వాయిదా వేసుకున్నాడు. ఎంత నష్టపోయినా ఫర్వాలేదనుకున్నాడు. బాలూ చేత పాట రికార్డు చేయించాకనే జయపూర్‌కు బయల్దేరారు. దానికి లాజిక్ ఏమిటో కూడా బాలూకి చెప్పాడు – 'నాకు ప్లేబ్యాక్ పాడుతున్నావని నువ్వు పదిమందికీ చెప్పుకుని వుంటావు. జ్వరం కారణంగా పాడలేకపోయానని తర్వాత చెబితే వాళ్లెవరూ నమ్మరు. క్వాలిటీ బాగాలేదని మార్చేశానని అనుకుంటారు. అది నీ భవిష్యత్తుకు దెబ్బ. నీకోసం ఈ విధంగా నేను షూటింగు వాయిదా వేసుకున్నానని టాక్ బయటకు వచ్చినపుడు నీ ఇమేజి పెరుగుతుంది. నీకు మంచి జరుగుతుంది.' అని చెప్పారు ఎమ్జీయార్. ఎంత గొప్పగా ఆలోచించాడో చూడండి. (బాలూ ఎమ్జీయార్‌కి పాడిన పాట మహదేవన్ ట్యూన్ చేసినదే అయినా ఎమ్మెస్ విశ్వనాథన్‌గారు తన ప్రోగ్రాంలలో దాన్ని పాడించేవారు. దానికి తమిళనాడు ప్రభుత్వం ఉత్తమగాయకుడిగా అవార్డు యిచ్చింది. బాలూ అందుకున్న తొలి ప్రభుత్వ ఎవార్డు అదే)

ఇప్పుడు ఎమ్జీయార్ బాల్యం గురించి చెప్తాను. అతని తల్లి భుక్తి కోసం పిల్లల్ని డ్రామా ట్రూపులో చేర్పించిందని చెప్పాను కదా. ఆ బృందం పేరు "ఒరిజినల్ బాయ్స్". ఎమ్జీయార్‌ది తెల్లటి శరీరం. గిరిజాల జుత్తు. పొట్టే కానీ తమిళులకు ఫర్వాలేదు. నాటకాల్లో వేషాలు వేస్తూ వుండగానే 18 వ యేట "సతీ లీలావతి" (1935) అనే సినిమాలో ఎల్లిస్ డంకన్ అనే అమెరికాలో పుట్టి దక్షిణభారతంలో సినిమాలు తీసిన డైరక్టరు ఓ యిన్‌స్పెక్టర్ వేషం యిచ్చాడు. ఎన్టీయార్ మొదటి వేషం ("మనదేశం") కూడా ఇన్‌స్పెక్టరే. కానీ ఎన్టీయార్ రెండో సినిమాకే హీరో అయిపోయాడు. కానీ ఎమ్జీయార్‌కు గుర్తింపు గల వేషం వచ్చేసరికి పుష్కరం పట్టింది. ఆనాటి మేటి హీరో త్యాగరాజ భాగవతార్ నటించిన "అశోక్ కుమార్" సినిమాలో ఎమ్జీయార్ ఆయనతో కలిసి నటించాడు. అంటే ఏమిట్రా అంటే హీరో గుడ్డివాడై పోయినప్పుడు అతని చేతికి కర్ర అందిస్తాడన్నమాట. అదీ అతనికున్న ఏకైక సీను ! కరుణానిధి రాసిన "రాజకుమారి" (1947)తోనే అతని దశ తిరిగింది. 1954 నాటి "మలై కల్లన్" (తెలుగులో "అగ్గిరాముడు")తో పెద్దలను కొట్టి పేదలకు పంచే రాబిన్ హుడ్ ఇమేజి స్థిరపడింది. ఇక అక్కణ్నుంచి సూపర్ స్టారే.

సినిమాల్లో వేషాలు దొరక్క అల్లాడుతున్న సమయంలోనే యింటి పరిస్థితులు కూడా క్లిష్టంగా వుండేవి. భార్గవి (తంగమణి అనే మరో పేరు కూడా వుంది) అనే అమ్మాయిని పెళ్లాడితే ఆమె మూణ్నెళ్లలోనే చనిపోయింది. ఆ తర్వాత సంతానవతి అనే ఆమెను పెళ్లాడితే ఆమెకు క్షయ వచ్చి 18 ఏళ్లపాటు బాధపడి మరణించింది. ఆమె బ్రతికి వుండగానే ఎమ్జీయార్ తనతో హీరోయిన్‌గా నటించిన వి యన్ జానకి అనే నటి అంటే యిష్టపడ్డాడు. కానీ ఆమె అప్పటికే వివాహిత. ఆమె భర్త గణపతి భట్‌ను విడిచి యితని వద్దకు వచ్చేసింది. విడాకులు యిచ్చిందనే అంటారు కానీ ఎమ్జీయార్ తన విల్లులో ఆమెను "వి యన్ జానకి" అనే పేర్కొన్నాడు కానీ "జానకీ మెనోన్" (వివాహం తర్వాత భర్త యింటిపేరు వస్తుంది కదా) అని అనలేదు. విడాకుల విషయంలో లీగల్‌గా ఏదైనా

**తెరపై రాబిన్‌హుడ్ వేషంలో మంజులతో, తెర వెనుక ఒక పేదరాలితో...**
**రెండు రకాలగానూ ప్రజల్ని మెస్మరైజ్ చేసిన ఎమ్జీయార్**





పేచీ వుందేమో తెలియదు. ఏది ఏమైనా వాళ్లిద్దరూ భార్యాభర్తలు గానే జీవించారు.

ఆమె వుండగానే ఎమ్జీయార్‌కు జయలలితకు బంధం ఏర్పడింది. దాన్ని ఒక్కొక్కరు ఒక్కోలా నిర్వచిస్తారు. "మా యిద్దరికీ గుళ్లో పెళ్లయింది'' అంటుంది ఎమ్జీయార్ కంటె మూడు దశాబ్దాలు చిన్నదైన జయలలిత. "అబ్బే కాలేదు"

అంటారు ఎమ్జీయార్ అనుచరులు. ఎమ్జీయార్ దీనిపై నోరు విప్పలేదు. బ్రాహ్మణ వ్యతిరేక పార్టీ అయిన డిఎంకె పార్టీలో ముఖ్యసభ్యుడైన ఎమ్జీయార్ భార్య జానకి, భార్యాసమానురాలు జయలలిత యిద్దరూ బ్రాహ్మణులే ! ఇందరు భార్యలున్నా ఎమ్జీయార్‌కు పిల్లలు పుట్టలేదు. మేని ఛాయ బంగారు రంగులో నిలుపుకోవడానికి, లైంగిక పటుత్వానికి ఎమ్జీయార్ స్వర్ణభస్మం అనే ఆయుర్వేద ఔషధం సేవించేవాడని, దానివలన నపుంసకత్వం దాపురించిందని అంటూంటారు. స్వర్ణభస్మం మాట ఎలా వున్నా ఎమ్జీయార్ తన ఆరోగ్యం పట్ల చాలా శ్రద్ధ వహించేవాడు. నిత్యం కసరత్తు చేసేవాడు. వేళకి తినేవాడు. సరైన ఆహారం, సరైన మోతాదులో తినేవాడు. శారీరకంగా పటిష్టంగా వుండేవాడు. పిల్లలు పుట్టేమాటయితే యవ్వనంలో వుండగానే పుట్టేవారు. ఏదైనా మెడికల్ ప్రాబ్లెమ్ వుండి వుండవచ్చు. దానికీ స్వర్ణభస్మానికి ముడి పెట్టడం అనవసరం.

"రాజకుమారి" సినిమా షూటింగుకై కోయంబత్తూరు వచ్చిన కరుణానిధిని అతను కలిశాడు. ఇద్దరూ అక్కడే వుండేవారు. వాళ్లిద్దరి మధ్య గాఢమైన స్నేహం ఏర్పడింది. కరుణానిధి తన కంటె పెద్దవాడైన ఎమ్జీయార్‌ను తన మేధస్సుతో ప్రభావితం చేశాడు. ఎమ్జీయార్‌కు అతనంటె గురి ఏర్పడింది. నిజానికి ఎమ్జీయార్ అప్పట్లో కాంగ్రెస్ వాది. ఖద్దరు మాత్రమే కట్టేవాడు. భగవద్భక్తుడు. కుమారస్వామిని పూజించేవాడు. కరుణానిధి అతన్ని నాస్తికుడిగా మార్చి ద్రవిడ రాజకీయాల వైపు మళ్లించాడు. 1953లో ఎమ్జీయార్ డిఎంకెలో చేరాడు. శివాజీ గణేషన్ అప్పటిదాకా డిఎంకెలో వుండేవాడు. కరుణానిధి ఎమ్జీయార్ వైపు మొగ్గడంతో అతను కాంగ్రెస్‌వైపు మళ్లాడు. కామరాజ్ వున్నంతకాలం రాజకీయాల్లో శివాజీ ఓ వెలుగు వెలిగినా తర్వాత కాంగ్రెస్‌లో అతన్ని పట్టించుకునేవారు లేకపోయారు. చివరకు విసిగి బయటకు వచ్చి తనే ఒక పార్టీ పెట్టి పూర్తిగా దెబ్బ తిన్నాడు. ఆ విధంగా కరుణానిధి ఎమ్జీయార్‌కు తొలినాళ్లలో ఉపయోగపడ్డాడు. దానికి ప్రతిగా 1969లో అణ్ణాదురై మరణించినపుడు అతని వారసుడిగా ఎవరుండాలన్న మీమాంస వచ్చినపుడు ఎమ్జీయార్ బలపరచడం చేతనే కరుణానిధి ముఖ్యమంత్రి అయ్యాడు.

1947 నుండి కరుణానిధి సినిమాల్లో పైకి వచ్చాడన్న చెప్పుకున్నాం కదా. రాజకీయంగా ఎలా అడుగులు పడ్డాయో వచ్చే శుక్రవారం చూద్దాం.